క్లుప్తంగా

మూడో రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

పెడన: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం వారికి మూడో రోజు పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. పెడన విజయానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి 344 మందికి గాను 326 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారని అధికారులు రమణరావు, మున్వర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అవనిగడ్డ, పాత ఎడ్లంక, వేకనూరు, తుంగలవారిపాలెంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

బంధన్ బ్యాంక్ చల్లపల్లి శాఖ ప్రారంభం



చల్లపల్లి: బంధన్ బ్యాంక్ చల్లపల్లి శాఖను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బంధన్ బ్యాంక్ ఉయ్యూరు ఏరియా మేనేజర్ లక్ష్మణ్ బిశ్వాస్ కోరారు. స్థానిక భారతలక్ష్మి రైస్‌మిల్లు సమీపంలో ఏర్పాటు చేసిన బంధన్ బ్యాంక్ చల్లపల్లి శాఖను గ్రామ ప్రముఖులు ఆకుల ధనుంజయరావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెనాలి ఏరియా మేనేజర్ జి.కృష్ణ, అవనిగడ్డ మేనేజర్ పవన్ కుమార్, చల్లపల్లి మేనేజర్ మను, నూతన ఖాతాదారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



పురిటిగడ్డ(చల్లపల్లి): గ్రామానికి చెందిన మద్దాల నాగరాజు ఇటీవల మృతిచెందాడు. పురిటిగడ్డ శాఖలో పీఎం జీవన్ జ్యోతి పథకం కింద జీవిత బీమా పాలసీ ఆయనకు ఉంది. బీమా రూ. 2 లక్షల చెక్కును మృతుడి భార్య రజితకు స్థానిక ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బి.బాసు శుక్రవారం అందజేశారు.

రైతుల ధర్నా

మోపిదేవి: ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేసి రైతులకు వెంటనే సొమ్ము చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం పలువురు రైతులు ధర్నా నిర్వహించారు. కేవలం కల్లాల్లోని ధాన్యమే ఆన్‌లైన్ చేస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల బస్తాకు రూ. 400 నష్టపోవాల్సి ఉంటుందని వాపోయారు. అనంతరం తహసీల్దార్ కె. నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె. కొత్తపాలెంకు చెందిన రైతులు మత్తి నాగమల్లేశ్వరరావు, దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, చందన అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం



నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప పంచాయతీ పాలకవర్గ సభ్యురాలు పెనుమత్స వెంకట రమణ భర్త కొండలు ఇటీవల మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సమకూర్చిన రూ. 10 వేల నగదును మృతుడి భార్య వెంకట రమణకు సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి) ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వ్యాస రచనలో విద్యార్థి ప్రతిభ



గుడ్లవల్లేరు: తపాలా శాఖ వారు '2047లో నా భారతదేశం' అనే అంశంపై నిర్వహించిన ఇంగ్లిషు వ్యాసరచన పోటీల్లో గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని యు.ఉషాప్రియ స్టేట్ సెకండ్ ర్యాంక్‌ను సాధించింది. ఉషాప్రియకు శుక్రవారం రూ.10వేల బహుమతిని అందించినట్లు హైస్కూల్ హెచ్ఎం జి.మురళీకృష్ణ తెలిపారు. విజేతతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వజ్రధరరావు, అజంతుల్లాను హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి అభినందించారు.

ముంచేసింది

- పలు ప్రాంతాల్లో వర్షానికి తడిసిన మినుము పంట
- కోయని పంటకు నష్టమే
- కాయలు పగిలి రాలిపోయే ప్రమాదం
- ఆందోళనలో రైతులు



మినుము బస్తాలను ట్రాక్టర్లకు ఎత్తుతున్న కూలీలు



కోడూరులో మినుము పంటపై పరదాలు కప్పుతున్న రైతులు

అవనిగడ్డ: అకాల వర్షం దివిసీమ రైతులను ముంచింది. కూలీలతో లాగించిన పంట తడిసిపోయింది. నూర్పిడి చేసి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం నీటిపాలైంది. కోత కోయకుండా ఉన్న పంట కూడా వర్షానికి నానిపోయింది. ఫలితంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 56,485 ఎకరాల్లో మినుము, 84 ఎకరాల్లో పెసర సాగు చేశారు. శుక్రవారం కురిసిన కుండపోత వర్షానికి అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యం తడసిపోయింది. తయారై ఎండిపోయిన పంట పగిలిపోయి దెబ్బతింటుందనే ఉద్దేశంతో గురువారం చాలా ప్రాంతాల్లో రైతులు యంత్రాలతో మినుము నూర్పిడి చేయించారు. వాతావరణం బాగుండటంతో ఆరబెట్టిన తర్వాత ధాన్యాన్ని ఇంటికి తరలించు కుందామనుకున్నారు. శుక్రవారం ఉదయం కురిసిన కుండపోత వర్షానికి కొన్నిచోట్ల మినుము పంట తడసిపోయింది.

తడిస్తే కాయలు రాలిపోతాయి

కోయకుండా ఉన్న మినుము పంట వర్షం వల్ల తడవడంతో కాయలు పగిలిపోతాయని రైతులు చెబుతున్నారు. కాయల మొదట్లో ఉండే కాండం తడవడం వల్ల ఆరిన తర్వాత కాయలు రాలిపోతాయని, దీనివల్ల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పనలపై ఉన్న పంట తడవడం వల్ల కాయలు పగిలిపోయి విత్తనాలు రాలిపోతాయని, ఈ వర్షం వల్ల అన్ని విధాలా రైతులకు నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.

పంటచేతికందేనా..

మరో రెండు రోజుల పాటు సాధారణ, భారీ వర్షాలు ఉంటాయనే వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన రైతులు మరికొద్ది రోజుల్లో పంట ఇంటికి చేరుతుందని ఆశపడగా.. అకాల వర్షాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రెండో పంట మినుముపై ఆశతోనే కౌలు రైతులు సాగుచేస్తుంటారు. వర్షాలకు పంట తడవడంతో దిక్కుతోచని స్థితిలో కౌలు రైతులు ఉన్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే పంటమీద పొలాలకు నష్టం వాటిల్లుతుందని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పెరిగితే పంటపై ఆశ వదులుకోవడమేనని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మినుము రైతులను ముంచిన వర్షం

కోడూరు: శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పొలాల్లో కాయతీత పూర్తి చేసి కుప్పలుగా వేసిన మినుము పైరు మొత్తం తడిచిపోయింది. కాయతీతలకు సిద్ధమైన మినుము పంట కూడా వర్షం వల్ల దెబ్బతిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని జయపురం, వి.కొత్తపాలెం, కృష్ణాపురం, విశ్వనాథపల్లి, లింగారెడ్డిపాలెం, చినగుడుమోటు, పెదగుడుమోటు, పోటుమీద గ్రామాల్లో సుమారు ఏడు వేల ఎకరాల్లో మినుము పంట కాయతీతలు పూర్తి చేసి కుప్పలుగా ఉంది. ప్రస్తుతం ఈ పంట మొత్తం వర్షంతో దెబ్బతినే ప్రమాదం ఉందని, మినుము గింజలోకి నీరు చేసి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు హడావుడిగా యంత్రాల సహాయంతో పంటను కోసి ఇళ్లకు చేర్చుకున్నారు. కుప్పలుగా ఉన్న మినుము పంటను రక్షించుకునేందుకు రైతులు పొలం బాట పట్టారు. పంటపై పరదాలు, టార్పలిన్ కవర్లు కప్పి రక్షించుకొనే ప్రయత్నం చేశారు.

రైతన్నకు ఎంత కష్టం

గూడూరు: పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షంతో రైతన్నకు తీవ్ర కష్టం వచ్చిపడింది. గూడూరు మండలంలోని మల్లవోలు, రాయవరం ప్రాంతాల్లో కొంత మేర వేరుశనగ, మిగిలిన ప్రాంతంలో రైతులు అపరాలు సాగు చేశారు. అపరాల పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. శుక్రవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పొలాలపై ఉన్న పంట తడిచిపోయింది. కుప్పలదశలో ఉన్న పంటను రైతులు పరదాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. కోత దశలో ఉన్న పంట పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరుణ దేవుడు శాంతించకుంటే నోటి దాకా వచ్చిన పంట నీటి పాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండో పంటపై ఆశతోనే..



ఎకరాకు రూ.30 వేల చొప్పున మూడు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. రెండో పంటపై ఆశతోనే సాగు చేస్తాం. నిన్ననే మిషన్‌తో నూర్పించాను. వర్షాల వల్ల ఆరకుండానే సంచుల్లోకి ఎత్తి ఇంటికి తీసుకెళ్తున్నాను. ఆరక పోవడం వల్ల బూజు పడతాయి. తాలు గింజలు ఎక్కువగా వస్తాయి. వర్షం వల్ల అన్నింటా నష్టమే.

– నాగినేని శ్రీనివాసరావు, రైతు, బందలాయిచెరువు

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఎస్పీ జాషువా, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం ఆయన చాంబర్‌లో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కార పరిస్థితిపై ఎస్పీ పి. జాషువాతో కలిసి పోలీస్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఏయే దశల్లో ఉన్నాయో, ఎందుకు జాప్యం జరుగుతుందో ఆయన అడిగి తెలుసుకున్నారు. 49 కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయని, 228 కేసులు పెండింగ్ ట్రైల్‌లో ఉన్నాయని తెలుసుకున్నారు. కేసులు సత్వరమే దర్యాప్తు చేయాలన్నారు. పెండింగ్ ట్రైల్‌లో ఉన్న కేసులలో కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వాటికి సంబంధించి తహసీల్దార్లు ఎటువంటి జాప్యం లేకుండా ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కోర్టు స్టే ఉన్న కేసుల్లో స్టే వెకేషన్ కోసం అవసరమైన చర్యలు తీసుకుని పూర్తి చేయాలన్నారు. కోర్టులో కేసు నెంబరు కోసం వేచి ఉన్న కేసుల్లో సంబంధిత న్యాయమూర్తులతో చర్చించాలని చెప్పారు. చార్జిషీట్ ఫైల్ చేసిన కేసుల్లో ఎన్ని కేసులకు సంబంధించి బాధితులకు నష్టపరిహారం మంజూరు చేశారు, ఎన్ని పెండింగ్ ఉన్నాయో కేసుల వారీ నివేదిక సమర్పించాలన్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో ఆలస్యం జరగకుండా అర్హత మేరకు వెంటనే మంజూరు చేయాలని చెప్పారు. దీనికి బడ్జెట్ సమస్య లేదన్నారు. పూర్తయిన కేసుల్లో బాధితులకు నూరుశాతం నష్టపరిహారం చెల్లించాలన్నారు. 2022వ సంవత్సరంలో 44 కేసుల్లో బాధితులకు రూ. 43 లక్షలు, 2023వ సంవత్సరంలో ఇప్పటి వరకు 36 కేసుల్లో బాధితులకు రూ. 18.47 లక్షలు నష్టపరిహారం మంజూరు చేశామన్నారు. కేసుల్లో నష్టపోయిన బాధితులకు అర్హత మేరకు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. సరస్వతి, డీఎస్పీలు మాసూంబాషా, మహబూబ్‌బాషా, సత్యానంద్, విజయపాల్, ఆర్డీఓలు ఐ. కిషోర్, పద్మావతి, విజయకుమార్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- ఘనంగా ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పురిటిగడ్డ(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డ ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర తాజా బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించిందని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం విద్యా బోధన, నాణ్యమైన విద్య, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, విదేశీ విద్య, ఒకటో తరగతి నుంచి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెనతో పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం అందిస్తున్నారని వివరించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే రమేష్‌బాబు తాను స్వయంగా తెచ్చిన నోట్ బుక్స్ అందజేశారు. వార్షికోత్సవ నిర్వహణకు ఎమ్మెల్యే తన వంతుగా రూ.5 వేలు విరాళం అందజేశారు. ఈ పాఠశాల సాధనకు, నిర్మాణానికి, అద్భుత ఫలితాలు సాధించేలా అనునిత్యం ప్రోత్సహిస్తున్న నిమ్మగడ్డ గ్రామ పెద్దలను, యువతను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యా, సాంస్కృతిక, క్రీడా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ కె.రాజ్‌కుమార్, విశ్రాంత ఎంఈఓ వేమూరి మురళీకృష్ణ, సీఐ బి.భీమేశ్వర రవికుమార్, సర్పంచ్ మాతంగి రమ్య, హెచ్ఎంలు కేఎస్‌వీఎస్ లక్ష్మి, దేవరపల్లి సురేష్‌బాబు పాల్గొన్నారు.

అజెండాలోని నాలుగు అంశాలకు కౌన్సిల్ ఆమోదం

- నెలాఖరులోగా పన్నులు చెల్లించేవారికి వడ్డీ రాయితీ
- తాగునీటి అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం





సమావేశంలో మేయర్ వెంకటేశ్వరమ్మ ; మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ సూరిబాబు

మచిలీపట్నంటౌన్: అజెండాలోని నాలుగు అంశాలు, టేబుల్ అజెండాలోని రెండు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో డివిజన్‌కు రూ. 20 లక్షలు కేటాయిస్తూ అభివృద్ధికి తోడ్పాటును అందించారన్నారు. నగరంలో ఇప్పటి వరకు 22 డివిజన్లలో 73 పనులను రూ. 3.39 కోట్ల గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ నెలాఖరులోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు అసలు చెల్లించే వారికి వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం గురువారం జీఓ జారీ చేసిందని, దీనిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మేయర్ ప్రసంగం ముగిసిన అనంతరం అజెండాలోని రెండో అంశంగా ఉన్న మెడికల్ కళాశాలకు 1150 కిలో లీటర్ల తాగునీటిని ప్రతి రోజూ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఎస్ఐడీసీ సంస్థ కోరగా ఈ అంశంపై టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిమ్మలూరులోని బెల్ కంపెనీకి తాగునీరు ఇవ్వలేమని, ప్రస్తుతం మెడికల్ కళాశాలకు ఇచ్చేందుకు తీర్మానించడం సబబుకాదన్నారు.

మెడికల్ కాలేజీకి తాగునీరు ఇస్తే నగర ప్రజలకు తాగునీటిని ఎలా సరఫరా చేస్తారని టీడీపీ సభ్యులు ప్రశ్నించారు. దీనికి డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, కో–ఆప్షన్ సభ్యుడు తుమ్మలపల్లి జగన్నాథం బదులిస్తూ గత టీడీపీ పాలనలో నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉండి తాగునీటి కోసం ప్రజలు రోడెక్కారని గుర్తుచేశారు. పుట్లమ్మ చెరువులో తాగునీరు లేక ఎండిపోవడంతో యువకులు క్రికెట్ ఆడుకున్నారన్నారు. శివరాత్రి సందర్భంగా నాగులేరులో పుణ్యస్నానాలకు నీటిని వదలలేని ప్రభుత్వం నీరు సరఫరా చేయకపోవడంతో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా కాలువలో నింపిన చేతకాని పాలన మీదంటూ టీడీపీ సభ్యులను దుయ్యబట్టారు. మొదటి అంశంగా ఉన్న రత్నం స్కూల్ స్థలాన్ని నివాసయోగ్య భూమిగా మార్చాలనే అంశంపై టీడీపీ సభ్యులు, వైఎస్సార్ సీపీ రెండో డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్కూల్ మూతపడటంతో ఆ స్థలాన్ని నివాసయోగ్యంగా మార్చాలని స్థల హక్కుదారులు కోరారని, దీనిపై వార్డు ప్రజలకు అభ్యంతరం లేదని అలాంటప్పుడు మీకొచ్చిన అభ్యంతరం ఏమిటంటూ టీడీపీ సభ్యులను విజయ్ ప్రశ్నించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, కమిషనర్ చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రిక, ఎంఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ఎంపీపీ వాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాల్‌లో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. గ్రామీణ నీటి సరఫరా ఏఈ ప్రవంతి మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు నిర్మాణం పూర్తయిందన్నారు. కుళాయిల కనెక్షన్లు కూడా ఇచ్చేశామని, మరికొన్ని చోట్ల తాగునీటి పైపులైన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. పైపులైన్ల నిర్మాణాలు జరిగే సమయంలోనే కుళాయిలు ఎవరైనా తీసుకోవాలనుకుంటే అప్పటికప్పుడు ఇస్తామని, పాలకులు ఈ విషయాలను గ్రామస్తులకు తెలియజేసి ప్రోత్సహించాలని సర్పంచులకు సూచించారు. ఎంపీపీ వాణి మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా నీటి కొరత లేకుండా చూడాలన్నారు. కాలువలు ద్వారా మరో దఫా నీరు విడుదలయ్యే అవకాశం ఉన్నందున చెరువులు నింపే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. తాగునీటి చెరువులు లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని, అందుకు ఎక్కడెక్కడ ట్యాంకర్ల ద్వారా నీటి అవసరం ఉందో గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. వ్యవసాయంపై జరిగిన చర్చలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నాయని, ఇప్పుడిప్పుడే మినుము నూర్పిళ్లతో పాటు ధాన్యం కుప్పలను కూడా తీస్తున్నారని వీఏఏ శిరిష తెలిపారు. ఎంఈఓ మెటాల్దారాణి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తామన్నారు. హౌసింగ్, వైద్యం, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, ఆర్టీసీ, విద్యుత్ తదితర శాఖలపై సమీక్షించారు. ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, వైస్ ఎంపీపీలు యాదంరెడ్డి వరప్రసాదరావు, పరసా వాకాలమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రవాణా శాఖాధికారుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రవాణా శాఖాధికారులు, సిబ్బంది

చిలకలపూడి(మచిలీపట్నం): కాకినాడ జిల్లా కాకినాడ నగరంలోని భానుగుడి సెంటర్ వద్ద విధి నిర్వహణలో ఉన్న అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. చిన్నారావుపై దాడి చేయడం దారుణమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ నాయకులు ఎం. సీతాపతిరావు అన్నారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద శుక్రవారం నల్లరిబ్బన్లతో రవాణా శాఖాధికారులు నిరసన తెలిపారు. సీతాపతిరావు మాట్లాడుతూ కాకినాడ నగరంలో కొబ్బరి బొండాల లోడుతో వెళుతున్న వ్యాన్ ట్యాక్స్‌లు చెల్లించలేదని తెలుసుకున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు ఆ వాహనాన్ని నిలుపుదల చేసి కాగితాలు తీసుకురమ్మని అడిగారన్నారు. కొబ్బరి బొండాలు తీసుకువెళుతున్న వాహనం డ్రైవర్ కాగితాలు చూపకుండా విచక్షణారహితంగా చిన్నారావుపై, కారు డ్రైవర్‌పై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి. శ్రీనివాసరావు, పలువురు రవాణా శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాపై అవగాహన

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నిధుల వినియోగం, ఆర్థికాభివృద్ధి సాధనపై లబ్ధిదారులకు అధికారులు పలు సూచనలు చేశారు. నిధుల వినియోగంపై లబ్దిదారులు ఇచ్చిన సమాధానాలకు అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం డి. శ్రీను, సచివాలయ మండల కన్వీనర్ కె. సుబ్బారావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అవనిగడ్డ: అవనిగడ్డ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సనకా రఘురాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాయపూడి వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడిగా తిమ్మన సుబ్బారావు, కార్యదర్శిగా మెంగు నాగార్జునరావు, లైబ్రరీ కార్యదర్శిగా కర్రా సుధాకరరావు, కోశాధికారిగా బండి రఘుకుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పర్వూరి హనుమాన్ రామకృష్ణ, తోట వీరబాబు, తాడేపల్లి రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులు



ఇనుమర్తి సుకీర్తి



తాతా యోగశ్రీప్రియ



కాగిత పల్లవి


బంటుమిల్లి: మండల పరిధిలోని రెండు పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థినులు తయారు చేసిన ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయని ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. బంటుమిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇనుమర్తి సుకీర్తి కలుషిత నీటి ద్వారా స్వచ్ఛమైన గాలి తయారీపై ప్రాజెక్టు తయారు చేసింది. సుకీర్తికి గైడ్‌గా సీహెచ్ రజని వ్యవహరించారు. రామవరపుమోడి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన తాతా యోగశ్రీప్రియ ఉమెన్ సేఫ్టీ బ్యాంగిల్స్‌కు, కాగిత పల్లవి చేసిన ప్లాస్టిక్ రోడ్లు అంశాలు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వీరికి టి. రేణుకారావు, ఫణికిరణ్ గైడ్‌లుగా వ్యవహరించారు. విద్యార్థినులను పలువురు అభినందించారు. 21–22 సంవత్సరానికి సంబంధించి గత నెలలో ఆన్‌లైన్‌లో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం

మచిలీపట్నంటౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, పరీక్షలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని డాక్టర్ వైదేహి అన్నారు. నగరంలోని వల్లెగూడెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది శుక్రవారం వల్లెగూడెం నుంచి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడకు చెందిన మిరియాల శేఖర్‌బాబు జానపద కళాజాతా బృందం లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పిస్తూ కళాజాతాను ప్రదర్శించారు. వల్లెగూడెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బందరులో భారీ వర్షం



వర్షానికి తడవకుండా పచ్చి ఇటుకలపై కప్పిన పరదాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారు జాము నుంచే వర్షం కురిసింది. అప్పుడప్పుడు తెరపి ఇచ్చినా మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ప్రధాన రహదారిలో కూడా నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యాయి. అకాల వర్షంతో నగర శివారులోని ఇటుక బట్టీల నిర్వాహకులకు నష్టం వాటిల్లింది. తయారీలో ఉన్న పచ్చి ఇటుకలు వర్షానికి తడిచి ముద్దవ్వగా కాల్చేందుకు సిద్ధమైన ఇటుకలను కాపాడుకునేందుకు ప్లాస్టిక్ పరదాలను కప్పారు.

వైభవంగా సహస్ర కలశ గోక్షీరాభిషేకం



మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేట చిట్టి పిళ్లారయ్య స్వామి దేవస్థానంలో శత చండీ సహిత మహారుద్ర యాగం అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో గణపతిపూజ, సహస్ర కలశ గోక్షీరాభిషేకం, లక్ష్మీ గణపతిహోమం నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేగంగా రీ సర్వే ప్రక్రియ

గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా గూడూరు మండలంలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని మచిలీపట్నం డీఐఓఎస్ పైడి రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కోకనారాయణపాలెం, కంకటావ, గురిజేపల్లి, గంధ్రం గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో మొదటి విడతగా నాలుగు గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ చేపట్టామన్నారు. వీటిలో గురిజేపల్లిలో ఈ నెలాఖరులోగా రీ సర్వే పూర్తవుతుందని చెప్పారు. మిగిలిన గ్రామాల్లో కూడా సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గూడూరు మండల సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, రీ సర్వే డీటీ సాయి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.